# గాడిద

గాడిద కాగితాల్ని తింటుంది. కాని అదే దాని ఆహారం కాదు. మిట్టపెల్లి లక్ష్మణ్ కాగితాల్ని తింటాడు. అతనికి అదే ఆహారం. కనిపించిందాని మీదల్లా ఏదో ఒకటి రాస్తాడు. తోచిన దానిమీదల్లా మాట్లాడతాడు. మైకు దొరికితే వదలడు.

మిట్టపెల్లి లక్ష్మణ్‌కు ఈ మధ్యే యాభయి ఏళ్ళు పడ్డాయి. అతని రచనలన్ని సంకలించి ఈ యాభయ్యవ ఏట ఒక పుస్తకం వేద్దామని మిత్రులు నిర్ణయించారు. అతని మిత్రులతో "మిట్టపెల్లి లక్ష్మణ్ స్వర్ణోత్సవ సమితి" అంటూ ఒకటి ఏర్పడింది. ఈ సమితి మూడు కార్యక్రమాల్ని నిర్ణయించుకుంది. ఒకటి అతని రచనల సమగ్ర సంకలనం. రెండు సావెనీరు. మూడు సన్మానసభ. సన్మాన సభలో వీటిని ఆవిష్కరించాలి. తన రచనల్ని సేకరించి విభాగాలు చేసి యివ్వడం లక్ష్మణ్ బాధ్యతే. ఒక్కడితో కాని పని అవడంతో దానికి ఒక సంపాదక వర్గం ఏర్పడింది.

"మిట్టపెల్లి లక్ష్మణ్ స్వర్ణోత్సవ సమితి" పేరిట ఒక కరపత్రం, చందాల బుక్కులు అచ్చొత్తించారు. వాళ్ళ పని వాళ్ళు చేస్తున్నారు. లక్ష్మణ్ సొంత బావమరిది తన బావగారి సన్మానం తన సన్మానం లాగే అన్నీ తానై అందర్నీ ముందుకు కదిలిస్తున్నాడు.

లక్ష్మణ్ తన రచనలు ఇన్నాళ్ళకైనా ఒక సంకలనంగా వెలుగు చూడబోతున్నందుకు ఎంతో సంతోషించాడు. లక్ష్మణ్ ముప్పయి ఏళ్ళుగా తాను రాస్తూ వస్తున్న రచనల్ని వీలైనంత మేరకు జాగ్రత్త చేస్తూ వస్తున్నాడు. ఈ మధ్య అతని బిడ్డ సుజాత కూతురు "నిర్నిద్ర" తన ఆటల్లో భాగంగా కొన్ని కాగితాల్ని చింపేసింది. అతని కొడుకు జెగన్.... కొడుకు "హేత్వాసన్" గాలిపటాల కోసం కొన్ని చింపుకుపోయాడు. మనుమలు మనుమరాళ్ళు నడియింట్లో చేసే కాలకృత్యాలు తీయడం కోసం చింపుకున్న కాగితాలు పోగా మిగిలినవి రెండు గూళ్ళల్లో ఉన్నాయి. చదివిస్తామని అడుక్కుపోయి తిరిగియివ్వని రచనలెన్నో తేలక బాధపడిపోయాడు లక్ష్మణ్. తన సర్వీసు బుక్కులో ఇంక్రిమెంట్లు, ట్రాన్స్‌ఫర్లు, లీవులు ఎంట్రీ చేసినట్టుగా ఓ బుక్కుపెట్టి ఏ రచన ఎపుడు చేశాడు. ఏ పత్రికలకు పంపాడు. ఏఏ పత్రికలు తిప్పి పంపాయి. ఏ పత్రికలో అచ్చయింది. దానికైన ఖర్చెంత, వచ్చిన ప్రతిఫలం ఎంత, అది రాయడానికి గల నేపథ్యం, సందర్భం. దానిపై ఎవరు ఎపుడు ఎలా అభిప్రాయం వెలిబుచ్చారు వగైరా ఆ బుక్కులో ఎంట్రీ చేసి ఉంటే ఎంతో బాగుండేదని యిపుడు బాధపడ్డాడు. ఇకనుంచైనా ఆ పని చేయాలనుకున్నాడు.

ఆ పత్రికలు పుస్తకాలు ముందేసుకుని ఓ రోజంతా కూర్చున్నాడు లక్ష్మణ్. తన రచనల కటింగ్స్ అన్నీ వాటినించి తీసి ఫైలు చేశాడు. వాటిని ఎలా విభాగీకరించాలో తెలియరాలేదు. తాను ఎన్నో సంఘాల్లో ఉద్యమాల్లో పనిచేశాడు. ఎన్నో ప్రసంగాలు చేశాడు. ప్రకటనలు చేశాడు. ఖండనలు యిచ్చాడు. తీర్మానాలు చేశాడు. పత్రికల్లో అవి పడ్డకటింగ్స్, కార్యదర్శి నివేదికలు, గేయాలు, కథలు, కవితలు, కొన్ని సంపాదకీయాలు, ముందుమాటలు, సమీక్షలు, విమర్శలు, పత్రికలకు విభిన్న సమస్యలపై సందర్భాలపై రాసిన లేఖలు.... ఇలా రాతలో ఎన్ని ప్రక్రియలున్నాయో అన్నిట్లో గెలికినట్లుగా ఉన్నాయి రచనలన్నీ.

లక్ష్మణ్‌కు జీవిత కాలంలో ముప్పయి అయిదేళ్ళుగా స్నేహితుడుగా కొనసాగుతున్న క్లాసుమేటూ - రచయితా అయినవాడు కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వాడూ అయిన "చింతకింది అవిశ్రాంత" ఒక్కడే ఉన్నాడు. ఇటీవల ఒక యువ రచయిత్రి "కుప్పునపు చీరెల కోవేరి" పరిచయమై స్నేహంగా మారింది. యాభయి ఏళ్ళ వయస్సులో తన ముప్పయ్యేళ్ళ సాహిత్య సేవలో వెలువరించే అతని రచనల సమగ్ర సంకలనం కోసం సంపాదకవర్గంలో చేర్చుకునేందుకు అన్ని విధాలా అందుబాటులో ఉన్నది ఈ యిద్దరే. మీరెట్లా అయిడియా యిస్తే అట్లా విభాగాలు చేద్దాం అని వాళ్ళు ఫస్టు రీడింగ్ బాధ్యతను లక్ష్మణ్‌కే అప్పగించారు.

కుప్పునపు చీరెల కోవేరి మొదట లక్ష్మణ్‌కు అభిమానురాలుగా కోడలు వరుసలో అంకుల్ అంటూ పరిచయంలోకి వచ్చింది. ఆమె కె.సి. కోవేరి అనే కలం పేరుతో రాస్తుంది. కావేరి అనే పేరును కావాలనే కోవేరిగా మార్చుకున్న ఆమె ఎం.ఏ., ఎం.ఫిల్ చేసినా ఏదో ఊళ్ళో చిన్న బడిపంతులమ్మగా పనిచేస్తోంది.

లక్ష్మణ్‌తో సమానంగా చర్చలకు దిగుతూ ఇపుడామె అతని వయస్సునూ, అనుభవాల్నీ ధిక్కరించి అదీ యిదీ సూచిస్తూ ఉంటుంది. అవిశ్రాంతతో కల్సి ముగ్గురు ముచ్చటిస్తూ ఉంటారు. లోకంలోని విషయాలన్ని వారివే.

కోవేరి తనకు లెక్చరర్ మొగుడు ఎలా దొరుకుతాడు అని అంచనాల్తో కుస్తీ పడుతుంది. కట్నంతో అయితే ఎంత - ఎలాంటి మొగుడు దొరుకుతాడు. కులాంతరమైతే ఎలాంటి మొగుడు, ప్రగతిశీల భావాల మొగుడైతే ఎలా ఉంటాడు. ఏది ఎంత ఖర్చు - ఏ మొగుడైతే తక్కువ ఖర్చులో లెక్చరర్‌గా దొరుకుతాడు అని అంచనా వేస్తుంది. అవిశ్రాంతకు తెల్సిన పెళ్ళికాని కుర్ర లెక్చరర్ల ఆశల గురించి, అభిరుచుల గురించి, వాళ్ల కులాల గురించి, కులాల పట్టింపుల గురించి ఆరా తీస్తుంది. ఆమె ఆరాలు అన్నీ చూస్తుంటే ఆమె అవిశ్రాంత కోసం తన స్నేహం చేస్తుందా, తన స్నేహం కోసం అవిశ్రాంతను కలుపుకుందా అని లక్ష్మణ్‌కు అపుడపుడు అనుమానం వస్తుంది.

ఆమె చర్చల్లోని సెంటర్ పాయింటు, ఆశలు అన్నీ చూస్తుంటే తక్కువ ఖర్చుతో మంచి మొగున్ని సంపాదించడంలో భాగంగానే ఆమె విప్లవ సంఘాల్లో తిరిగిందేమోనని యిప్పుడు స్త్రీవాద కథలూ కవితలూ గట్రా రాస్తోందేమో అని లక్ష్మణ్ జుట్టు పీక్కున్న ఘటనలు లేకపోలేదు. కానీ అదేంటోగానీ లక్ష్మణ్‌కు కోవేరి అంటే ఏదో సాన్నిహిత్యం. ఆమె తన కూతురైతే భరించగలడు. కానీ కోడలైతే భరించలేననుకున్నాడు. అతను ఆమెను కూతుర్లానే భావిస్తున్నాడు. ఆమెలో తన బాల్యాన్ని చూసుకొని మురిసిపోతుంటాడు. కోవేరితో చర్చల్లో దిగినప్పుడల్లా తానూ తిరిగి పాతికేళ్ళ కుర్రాడైపోయినంత ఉత్సాహంగా ఉంటాడు. కోవేరి వయస్సులో తాను ఆ కాలంలో కోవేరిలానే ఎన్నెన్ని చర్చలు చేశాడో, ఎన్ని గోష్టులు, సభలు పెట్టారో... ఎన్ని పుస్తకాలు చదివాడో.... పత్రికలకు ఎలా ఉత్తరాలు రాసేవాడో చెప్తూ - లక్ష్మణ్ తన యవ్వన కాలాన్ని ఉత్తేజంగా వర్ణిస్తుంటాడు. ఎన్నిసార్లు ఎన్ని రచనలు పంపినా ఒక్క రచనా అచ్చేయని పత్రికా సంపాదకులకు ఆకాశరామన్న పేరుతో ఎన్ని బండబూతులు తిడ్తూ ఉత్తరాలు రాసేవాడో.... తన రాత గుర్తుపట్టకుండా మరొకరితో రాయించి లేదా టైపు చేయించి వేరే ఊరునించి ఎన్ని పోస్టులో వేయించేవాడో.....

అప్పుడు ఆ కాలంలో పత్రికలకు విలేఖర్లంటూ వేరే ఉండేవారు కాదనీ, తాను ఉద్యోగం చేస్తూనే దినపత్రిక విలేఖరిగా పనిచేసిన కాలంలో ఎవరెవర్ని ఎలా హడలగొట్టిందీ తనకు అధికారులంతా ఎలా భయపడిందీ.... చింతకాయలు దులిపినట్టు గలగల వర్ణిస్తుంటాడు. ఏ ఏ సంఘాల్లో ఏ ఏ పదవులు నిర్వహించిందీ, ఎలా గ్రూపులు కట్టి తమ ప్యానల్‌ను గెలిపించిందీ ఎమ్మెల్లేగా గెలిచినంత సంతోషంగా ఉబ్బిపోతూ చెప్తుంటాడు. వాటిల్లో కొంచెం చాదస్తం, కొంచెం ఆధిక్యతాభావం ఉన్నప్పటికీ

కోవేరి వాటిని ఎంతో ఆసక్తిగా విన్నట్టే ఉంటుంది. అవిశ్రాంత లేకపోతే యిద్దరివంతూ తానే మాట్లాడ్తాడు. కోవేరికి ఆ కాలం నాడు పత్రికలు, రచయితలు, సమాజం, వారి భావాలు తీరుతెన్నులు, సంగతులు ఎలా ఉండేవో లోతుగా తెల్సుకోవడానికి వీళ్ళిద్దరే సోర్సు. వాటిని యిప్పటి కోణంలో ఎలా రాయాలా అని ఆలోచిస్తూ ఆసక్తిగా వింటూ యింటికాడ డైరీలో అదంతా నోట్ చేసుకుంటూ ఉంటుంది. అంత మంచి స్నేహితులు ఎలాంటి అహంకారాలు లేకుండా దొరకడం కోవేరి అదృష్టమే.

లక్ష్మణ్ రచనల్ని కోవేరి పెద్దగా చదవలేదు. అతనే ఊరిస్తూ చెప్తుంటే చెవులు రిక్కించి వినేది. వీళ్ళ సాహిత్య సేవకు లక్ష్మణ్ భార్య ఊర్మిల నిజమైన సాహిత్య సేవ(సాహిత్యం అంటే వంట అనే అర్థం కూడా యిప్పటికీ ఉంది) చేస్తూ కోవేరి తన కూతురన్నట్టే మురిసిపోతుండేది. ఊరెడి రామలచ్చిమి అనే పేరు బాగాలేదని 'ఊర్మిల' అని పెట్టుకున్నాడు భర్త లక్ష్మణ్. సాహిత్య సేవలో భాగంగా కోవేరి వద్దు వద్దంటూనే సాహిత్యంతో పాటు టీ టిఫిన్లు కూడా కడుపులో వేసుకుంటూ "థాంక్సు ఆంటీ" అంటూ వీడ్కోలు తీసుకొనేది.

లక్ష్మణ్ జీవితకాల స్నేహితుడు అవిశ్రాంత యిపుడు రచనలు మానేసాడు. ఆ మాటకొస్తే ఆయన గట్టిగా రచనలు చేసిన కాలం అంటూ ఏదీ లేదు. అపుడపుడు ఏదో రాసేవాడు. ప్రసంగాలు చేసేవాడు. అందరూ అతన్ని కవి రచయిత అని ఉబ్బిస్తుంటే ఆ పదాలకు అలవాటు పడిపోయాడు. అతన్ని కవి రచయిత అని పిలువని వారిపట్ల అతనికి చిన్నచూపు. అలాంటివారి సాహిత్యాభిలాషను, అవగాహనను ఇక కించపరచడమే అతని పని. అందుకని అతని రచనలొక్కటి చదవక పోయినా అతన్నందరూ రచయిత అనే పిలుస్తుంటారు. అతను స్కూలు టీచరుగా ఉన్నప్పట్నుంచి మొదలుకొని కాలేజీ ప్రిన్సిపాల్ అయిం తర్వాత కూడా ఎందరో ప్రముఖ రచయితల్ని తను పనిచేసే ఊళ్ళో, స్కూల్లో, కాలేజీలో సభలకు పిలిచి ప్రసంగాలు యిప్పిస్తుండేవాడు. కొంత సన్మానం కూడా చేస్తుండేవాడు. ఎందరో రచయితలు ప్రేమతో అని సంతకం చేసి యిచ్చిన పుస్తకాలు బీరువాలో రెండు వరుసల నిండా ఉన్నాయి. స్వదస్తూరీతో కాంప్లిమెంటరీ యిచ్చిన పుస్తకాలు అతనికి ఆత్మ విశ్వాసం పెంచుకోవడానికి ఎంతో తోడ్పడ్డాయి. పరీక్షలు రాసి ప్రమోషన్లు కొట్టి వాళ్ళలా ఎదగాలనుకున్నాడు. ఎదిగాడు. అందుకని ఏ గ్రూపు రచయితలైనా, ఏ "వస్తువు" రచయితలైనా అతనికి ఎంతో అభిమానం. అతని అసలు పేరు చింతకింది అవిసయ్య అయితే 'అవిశ్రాంత' అనే కలం పేరుతో రచనలు చేసి ఆ తర్వాత సర్వీసు బుక్కులోనూ అవిశ్రాంత అని మార్పించుకున్నాడు. నిజంగానే అతను తన జీవితాన్ని అవిశ్రాంత పోరాటంతోనే గెల్చుకున్నాడు. కూలికి పెద్ద పద్మశాలీల వద్ద బట్టలు నేసుకు బతికిన చింతకింది భద్రయ్య కొడుకు కాలేజి ప్రిన్సిపాల్ స్థాయిదాకా ఎదగడం ఎంతో జీవన పోరాటం లేకుండా ఎలా సాధ్యం.

అవిశ్రాంతకూ లక్ష్మణ్‌కూ మధ్య అమ్మమ్మల తరఫునుండి అన్నదమ్ముల వరస ఉన్నప్పటికి వాళ్ళు ఎన్నడూ అలా పిలుచుకోలేదు. ఒకరినొకరు అనుసరించుకోలేదు. జీవితంలో ఎవరి వరుసవారిది. ఎవరి దారి వారిది. ఇద్దరి మధ్య స్నేహం బంధుత్వం ఎన్ని ఆటుపోట్లకు గురైనా సముద్రంలా నిలకడగానే కొనసాగుతోంది. భిన్నాభిప్రాయాల్ని సైతం సహించి గౌరవించడం వల్లనే అవిశ్రాంతకు అందరూ స్నేహితులే. లక్ష్మణ్ దారి అది కాదు. అతని తీరు సరిగ్గా యిందుకు భిన్నం. అతని అభిప్రాయాలు మారినపుడల్లా అతని స్నేహితులూ మారిపోయారు. భిన్నాభిప్రాయాల్లోనే ఉన్న పాత స్నేహితుల్తో పోట్లాడుకోలేదు గానీ నిర్లక్ష్యం చేశాడు. అతనికెప్పుడూ కొత్త స్నేహితులే ఎక్కువ. క్లాసుమేట్లు బంధువులు పోను సాహిత్యంలో అతనికి పాత స్నేహితులంటూ మిగిలింది చాలా తక్కువ. సన్నిహితులు మరీ తక్కువ.

కోవేరి, అవిశ్రాంతగారల కోరికపై లక్ష్మణ్ తన రచనల దుమ్ము దులిపి వరుసగా వారం

రోజులు రాత్రిళ్ళు వాటిని చదువుతూ విభాగించడం ప్రారంభించాడు. ఫైలు ట్యాగుల్తో వేర్వేరుగా హెడ్డింగులు పెట్టి కట్టాడు. వాటిని చదువుతుంటే ఏవేవో జ్ఞాపకాలు. కస్తూరి లక్ష్మిరాజం గారి 'తేజేశ్వర' ను మనసులోనే ఆరాధిస్తూ రాసిన కవితలు. చూసి ఏవో గిలిగింతలు కలిగాయి. ఆమెతో అనుకున్నట్టు పెళ్ళయి వుంటే ఈ బతుకు ఎంత బాగుండేదో.... ఇపుడామె బాంబేలోని ట్రాంబేలో సైంటిస్టు భార్యగా ఎంతో ఎత్తుకు ఎదిగిపోయింది. ఆమె పిల్లలందరూ ఆకుపచ్చ సిరాను అధికారంతో రాసేవారుగా ఎదిగిపోయారు. కొడుకులూ, బిడ్డలూ కోడళ్ళూ అల్లుళ్ళూ అందరూ ఎదిగి ఈ ఊరుతో ఇక్కడి కులంవారితో సంబంధాలు వదులుకున్నట్టే అయింది.

లక్ష్మణ్ నలుగురిని ప్రేమించిన క్రమంలో రాసిన నలభయి ప్రేమ కవితలు ఓ కట్టయి పోయింది. అందులో ఏడు అచ్చయినవి ఉన్నాయి. నిరుద్యోగంలో నిరుద్యోగం గురించి రాసిన యిరవై కవితల్లో అయిదు అచ్చయినవి ఉన్నాయి. చందమామ బాలమిత్రల కోసం రాసిన తొమ్మిది కథల్లో రెండు అచ్చయినవి కూడా ఉన్నాయి... ఎపుడో రాసిన ఓ సెక్సు కథ కూడా ఉంది. అది వేరే కలం పేరుతో అచ్చుకావడం అదృష్టం. లేకపోతే పరువుపోయేది అని ఊపిరి పీల్చాడు లక్ష్మణ్. సగం రాసి మధ్యలో వదిలేసిన కొవ్వలి-"జగజ్జాన" 25 భాగాల సీరియల్ నవల లాగా రాసిన జానపద నవలను సగం ఎలుకలు కొరికేశాయి. అబ్బో.... తనకు ఆ కాలంలో యింత చక్కని కల్పన, ఊహాశక్తి ఉండేదా.... అని అక్కడక్కడ దాన్ని తిరగేస్తూ ఆశ్చర్యపోయాడు లక్ష్మణ్. తన ప్రకటనలోంచి పత్రికలో అచ్చయిన ఈ రెండు వాక్యాలు ఎంత గొప్పగా ఉన్నాయి. ఆ రెండు వాక్యాల్ని సావెనీర్లో కొటేషన్‌గా వేయాలి. అరె... ఈ రెండు లైన్లు వేమన్నకన్నా చాలా బాగా వచ్చాయి.... అబ్బో యిది మార్క్సు కొటేషన్‌తో సమానంగా తూగుతుంది. ఈ నాలుగు వాక్యాలు చలం కన్నా బాగా వచ్చాయి. అబ్బ ఆ రోజు తాను రాసిన ఈ వార్త రాష్ట్రంలో ఎంత సంచలనం సృష్టించిందో.... ఈ వార్త వచ్చాక ఈ విషయంపై ఎన్ని ఉద్యమాలు లేశాయో... ఈ విమర్శలో వాన్ని భలే ఏకేశాను. వాడు చచ్చి ఊర్కున్నాడు... "ఇద్దరు భర్తల ప్రేమ" ముగింపు లేని - ఒక హీరోయిన్ యిద్దరు భర్తల డిటెక్టివ్ నవల... ఓ పక్క చెదలెక్కినట్టుంది.

ఇలా అన్ని రకాలను అన్ని రకాల ఫైల్లుగా మార్చేసరికి పాత కాగితాల వల్ల చేతులు దురదపెట్టాయి. తుమ్ములు అంటుకున్నాయి. వీటికి తోడు వాటిని చదివాక వెన్నువెంట వణుకు పుట్టుకొచ్చింది. వాటన్నిటిని అచ్చువేయడం కన్నా అచ్చు వేయకుండా ఉంటేనే ఎక్కువ గౌరవంగా ఉండేట్టుంది. తనకే ఈ ఆలోచన కలిగాక - అవిశ్రాంత, కోవేరీలకు ఎలాంటి ఆలోచన కలుగుతుందో.... రచయితగా తాను యింత నాసిరకంగా, యిన్ని సుడిగుండాల్లో తిరుగుళ్ళు తిరిగాడా.... ఈ గతం ఎవరికి తెలియకపోవడమే మంచిదేమో.... తన అన్ని రచనల్ని అచ్చు వేయడం కన్నా తన రచనలు చదివి, కవి సమ్మేళనాల్లో పాల్గొని ప్రభావితమైన యువరచయితల అభిప్రాయాల్తో సావెనీర్ ప్రచురిస్తూ దాన్లోనే టూఇన్‌వన్‌లాగా అనుబంధంలో ఒకటి రెండు కథలు, కవితలు గట్రా సాంపిల్‌గా చేరిస్తే బావుంటుందేమో ననుకున్నాడు. ఈ విరాళాలు ఎక్కువ వసూలు కాకపోతేనే బావుండు.... ననుకున్నాడు.

లక్ష్మణ్ అంచనాలకు భిన్నంగా, "లక్ష్మణ్ స్వర్ణోత్సవ సమితి" విరాళాలు, సావెనీర్లో ప్రకటనలు, పైసల వసూల్లు వేగం పుంచుకున్నాయి. లేక లేక మన కులంలో యింత గొప్ప రచయిత పుడ్తే.... సహకరించరా.... ఇన్ని లక్షలు సంపాదించి ఏం చేస్తారు. ఇంతమంది కుల బాంధవులుండి మనవాన్ని మనం సత్కరించకపోతే ఎట్లా అంటూ.... మరోపక్క లక్ష్మణ్‌గారి బావమరిది విరాళాలు సేకరిస్తూ విజృంభిస్తూ ఉన్నాడు. పూటకో అద్భుతం అంటూ వార్తలు తెస్తున్నాడు. అవి విన్నా కొద్దీ లక్ష్మణ్‌కు ఆనందం పెరిగే బదులు గుబులు ఎక్కువ కాసాగింది.

లక్ష్మణ్ యింతకాలం గుండెల్లో గుబులన్నది లేకుండా జీవించాడు. అతని డిపార్టుమెంటు

అధికారులు కూడా అతన్ని చూసి లోలోపల భయపడేవాళ్ళు. అన్ని పార్టీల ఛోటా మోటా నాయకులు అతన్ని మంచి చేసుకోవాలని నమస్కారాల్తో.... పెళ్ళి, పురుళ్ళ ఆహ్వానాల్తో గౌరవిస్తూ ఉండేవారు. ఇతర రచయితలకు, సంఘాలకు అతనంటే పెద్ద హడల్. ఎంతో అవగాహన గల ఆర్గనైజర్, రచయిత అని అతనికి పేరు.

అతని రచనల్తో అతనికి గతమంతా గుర్తొచ్చింది. ఇపుడా జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే ఎందుకో గుబులవుతున్నది. తనకు తన గతంలో, బాల్యంలో చెప్పుకోవడానికి ఘనతంటూ ఏమీ లేదు. పేదరికపు బాల్యం. పక్కింటివాల్లు అన్నం కూరలు మిగిలినై తీసుకు పొండి అని అంటే గబగబా పరిగెత్తేవాడు. అందులో మిగిలింది అన్నం కూరలు కాదని ఆ గిన్నెల్ని తోమి యివ్వడం కోసమే ఆ కాస్త మిగిల్చారని తెల్సు. అయినా అడగలేని అశక్తత. బాల్యంలో కోతికొమ్మాట బొంగరాలు గిల్లిదండ.... పండగ సెలవుల్లో ఎవరింట్లోనో గవ్వలత్తో, పచ్చీసు ఆట..... అయ్య అడుక్కొచ్చిన అంగీలు నెక్కర్లు.... బర్ల పెండ కోసం పోట్లాటలు.... స్కూల్లో పోసే పాలు టిఫిన్ల కోసం వెంపర్లాట... స్కూలుకు సెలవుంటే దుఃఖం వచ్చేది. ఇంట్లో మక్క గట్క మహ కడుపు నొచ్చేది. స్నేహం చేయబోతే అందరూ తిట్టి తరిమేసేవాళ్ళే....

ఇపుడా జీవితాన్ని తిరిగి చూసుకుంటే.... ఎక్కడికో పాతాళంలోకి పడిపోతున్నట్టుగా ఉంది. సమాజం మీద తనలో పేరుకు పోయిన కసితో తాను ఎలా విజృంభించాడు. జీవితాన్ని గెలుచుకోవాలనుకున్నాడు. లంచాల, పైరవీల పోటీలో అది సాధ్యం కాలేదు. సమాజం పట్ల మరింత కసి.... సంగాలు.... సాహిత్యం... సాహిత్య సంగాలు.... ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు. ముందుకే సాగిపోయాడు. ఇపుడు చూసుకుంటే ఏముంది... తానీ మత్తులో పడి ఎంతో జీవితం కోల్పోయాడు... ఎన్నో అవకాశాల్ని వదిలేసుకున్నాడు... చిన్న పరీక్షలు రాయక అశ్రద్ధ చేస్తూ..... మామూళ్ళు ఈయక ఎన్నో ప్రమోషన్లు రాకుండా పోయాయి. కొన్ని ప్రమోషన్లు రాకుండా చేయబడ్డాయి. యూనియన్ ద్వారా పోరాడి జీవో తెస్తే అది ఆఫీసు చేరేలోగానే ఎవడో వేలకు వేలు లంచాలు పెట్టి ఆ ప్రమోషన్లు కొట్టేసేవాడు. వాడికి అర్హతలున్నదీ నిజమే.... తనను వెనక్కి నెట్టడానికి ఎన్ని కారణాలో వెతికారు.... గట్టిగా మాట్లాడబోతే యూనియన్ నాయకుడే ఒక పెద్ద స్వార్థపరుడు అని ఎక్కడ ముద్రేస్తారోనని భయం... ఏ పరీక్షలూ రాయలేదు.... డిపార్టుమెంటు టెస్టులూ రాయలేదు. తనకన్నా ఎంతో జూనియర్స్ ప్రమోషన్స్ తెచ్చుకున్నారు. వాళ్ళు తనక్కూడా పై అధికారులుగా, జిల్లా అధికారులుగా మారి పాత పగ తీర్చుకున్నట్టుగా ప్రవర్తించేవారు.... ఎన్నో అవమానాలు... అనుక్షణం హృదయం తూట్లు పడేది. మరింత కసిగా.... అదే కమిట్‌మెంటూ, త్యాగం అనుకొని ఆర్గనైజర్‌గా, రచయితగా తానీ నష్టాలు భరించక తప్పదు అని ఆ తూట్లను ఈ తృప్తితో, మూసేసేవాడు. ఇపుడా మూసిన తూట్లన్నీ కరిగిపోయినట్లయింది.

తాను నిజంగా పొడిచేసిన పెద్దపోరాటాలేవీ లేవు.... సమాజం ఏ మేరకు ముందుకు సాగాలో అంతమేరకే కదులుతున్నది. ఇటు చూస్తే.... రచయితగా పెద్దగా పొడిచేసే రచనలంటూ, ఏమీ చేయలేదు. తాను యింతకాలం ఆత్మవంచన చేసుకొన్నాడా.... లేదా పొగడ్తలు... సంగాల్లో పెత్తనం మత్తులో పడి జీవితాన్నే నిర్లక్ష్యం చేశాడా.... తనకు తాను అన్యాయం చేసుకొని తన కుటుంబానికి అన్యాయం చేసి సమాజానికేదో మేలు చేస్తున్నానని మనస్సులో విర్రవీగాడా... తాను అవిశ్రాంతలా జీవితాన్ని ఎందుకు గెలుచుకోలేకపోయాడు. తాను రెండు పడవల్లో అటో కాలు యిటో కాలు వేసి దేన్లో కాకుండా రెంటి నడుమ మునిగిపోయాడా. లేకపోతే తన కూతురు, తన కొడుకూ కె.సి. కోవేరిలాగానైనా చదువుకోలేకపోయారెందుకని.... అవిశ్రాంత పిల్లలు, ట్రాంబేలోని తేజేశ్వరి పిల్లలు ఎంత ఎదిగిపోయారు....

పది పదిహేను రోజులుగా లక్ష్మణ్ అకస్మాత్తుగా ముసలితనం మీద పడ్డట్టుగా చావు దగ్గరపడ్డ

వాడిలా నిర్వేదంగా మారిపోవడం చూసి భార్య ఊర్మిల ఉలిక్కిపడింది. ఈ పదిహేను రోజులూ ఒకే పక్కమీద పడుకున్నా.... ఒక్కనాడూ ఒంటిమీద చేయివేయలేదు.... ఊర్మిల ఉలికిపాటుకు అది ఒక గట్టి కారణం. ఎంతో బాధలో ఉంటే తప్ప తన భర్త యిలా ప్రవర్తించడనీ తెల్సు. లక్ష్మణ్ పైకి బాగానే కనపడ్డాడు. ఊర్మిల ఎవరికి చెప్పుకోలేక తనలో తానే బాధపడి పోయింది. పిడికిలి బిగించి కంచుకంఠం మోగించే లక్ష్మణ్, అదిరిస్తూ బెదిరించే లక్ష్మణ్, కసురుకొని విసుగుకునే లక్ష్మణ్ మూగవోయినట్టుగా పరధ్యానంగా ఉంటే ఊర్మిలకు ఏదోలా ఉంది. అలవాటులేని ఆ స్థితిని తట్టుకోలేకపోయింది.

"ఏమాయె - చాయ్.... యింకెంతసేపు.... ఈ ఆకలి కేకల భుగభుగలు...." "గబ్బిలంతో కబురంపితినే.... శివుడైనా నీకు చెప్పరాలేదా...." అని అరిచి ఆ తర్వాత బిగ్గరగా నవ్వే ఆ నవ్వు మాయమై పోయింది. చాయిలో శర్కరా, కూరల్లో ఉప్పు ఎక్కువైందో తక్కువైందో చెప్పకుండానే ముగిస్తున్నాడీ మధ్య. కోవేరికి చెప్పుకుందామంటే ఏదో చిన్నతనం అన్పించింది. కాని భర్తను తిరిగి మంచి మూడ్‌లోకి తేగలిగేది కోవేరి ఒక్కతే అని తెల్సు. ఊర్మిల ఆలస్యంగానైనా కోవేరి ముందు తన బాధ వెళ్ళబోసుకోక తప్పలేదు.

"ఆ రచనల్ని వారం రోజులు చదివి చదివి గిట్లయిపోయిండు...." వాపోయింది ఊర్మిల. "అవి యివ్వండి అంటి.... నేను చదివి యిస్తాను" అని ఊర్మిల వాటిని పట్టుకెళ్ళింది. వారం రోజుల్లో చాలామేరకు చదివేసి లక్ష్మణ్ అంకుల్‌తో శనివారం సాయంత్రం చర్చకు కూర్చుంది కోవేరి. అవిశ్రాంత ఆ రోజు ఏదో ఊరెళ్ళాడు. అవీ యివీ జోక్సువేసి నవ్విస్తూ ఆనక అసలు విషయంలోకి వచ్చింది కోవేరి.

"మీ కవితలు నాకు చాలా నచ్చాయి అంకుల్".

"ఏ కవితలు"

"ముఖ్యంగా 'ధన్యం' అనే శీర్షికతో "కట్టా.... ఓ చీపురుకట్టా.... నిన్ను నడి యింట్లో నా దేవుని గూట్లో పెట్టా.... నీకు రోజో కొబ్బరికాయ కొట్టా.... నిన్నా సున్నితమైన చేతులు ముట్టా.... నీ బతుకు ధన్యం అట్టా.... నేనైనా కాకపోతిని ఆమె చేతిలోని చీపురుకట్టా.... ఆమె నన్నలా గుప్పిటలో పట్టా.... ఊడుస్తూ నేనామె సింగుల్ని అట్టూ యిటూ నెట్టా.... నీ జీవితం ధన్యం కాదెట్టా...." ఈ కవితలో మీరు అంత చిన్న వయసులో ఇంత సింబాలిక్‌గా మిమ్మల్ని మీరు చీపురుకట్టతో పోల్చుకోవడం.... ఆమె చేతులు తాకి పవిత్రమైనందున ఆ చీపురు కట్ట పవిత్రమైందని దాన్ని ఇంట్లో మీ దేవుని గూట్లో.... దేవతలాగా పూజిస్తాననడం... ఎంత గొప్ప ఉదాత్త కవిత్వం.... ఈ అంత్యప్రాసల కవిత్వం పాతపడితే పాతపడి ఉండొచ్చు. కాని ఆమె చేతులు తాకిన చీపురుకట్టను పూజిస్తాననడం..... నిజంగా మీకు ఆనాడే గొప్ప దళిత దృక్పథం, పీడితవర్గ దృక్పథం, స్త్రీవాద దృక్పథం ఉండేవి అనడానికి చక్కని తార్కాణం అంకుల్".

లక్ష్మణ్ మనసు ఎక్కడికో పోయింది. బాంబేలోని ట్రాంబేలో మనుమరాలుతో ముసి ముసి నవ్వులు నవ్వుతున్న కస్తూరి తేజేశ్వరి పక్కవీధిలో ముప్పయి అయిదేళ్ళ క్రితం లంగా మీదికి చెక్కి ఓణీ జారిపోతుంటే తెల్లారి లేవగానే వాకిలూడ్చే దృశ్యంతో లక్ష్మణ్ మనస్సులో ప్రత్యక్షమైంది. అతని పెదవులపై ఒక మెరుపు మెరిసింది. ఊర్మిలకు ప్రాణం లేచి వచ్చింది. చాయె చేసుకు రాను లేచింది. లక్ష్మణ్ మళ్ళీ నిశ్శబ్దమైపోయాడు.

"నా బొందలా ఉందా కవిత్వం. ఇంకా అందులో స్త్రీవాద వర్గవాద దళితవాద దృక్పథాలున్నాయా. ఏదో పెళ్ళికాక ముందు భావకవిత్వంలో పడి నా ఊహా ప్రేయసిని నాకు తోసినట్టు వర్ణించాను. ఇపుడీ కవిత సంకలనంలో ప్రచురిస్తే నా పరువు పోతుంది. ఆ కాలంలో నేను నిజంగానే ఎవర్నో ప్రేమించానసుకుంటారు...." అంటూ చిన్న అబద్ధం ఆడాడు. ఊర్మిలకు వినపడాలని గట్టిగానే

అరిచాడు.

"లాల్‌బహదూర్ శాస్త్రి చనిపోయినపుడు... మీరు రాసిన ఈ కవిత ఎంతో బాగుంది అంకుల్. 'పొట్టివాడు, మహా గట్టివాడు... పేదరికపు సృష్టివాడు... హిమాలయాలకు ఎదిగిన మట్టిమహా మనిషివాడు....."

"చాలు చాలు ఎవరైనా వింటే నవ్విపోతారు.... పైగా యిపుడు నా అవగాహన మారింది గదా. పాలకవర్గ ప్రభుత్వాధినేతల గురించి రాయడం పాలకవర్గాలకు కొమ్ము కాయడమే.... ఈ కవితను ప్రచురిస్తే ఇప్పటి నా పరువేం కాను... ఇప్పుడు ముఖ్యమంత్రి మీదా, మంత్రుల మీదా, ప్రధానమంత్రుల మీదా పంచరత్నాలు రాసే కవులను ఎంతో విమర్శిస్తున్నాను. మా వయసులో నువ్వేం చేశావు.... మా చెప్పొచ్చావులే... అంటూ మళ్ళీ బొట్టూ కాటుక కుచ్చిళ్ళు గురించి కవిత్వం రాయడం మొదలెడతారు వాళ్ళు...."

"ఇది చాలా బాగుంది అంకుల్. మావో వైరుధ్యాల సూత్రాన్ని గుప్పిట పట్టినట్టుంది. "నీవు అద్దం నేను నిలువు. నీవు తూర్పు పడమరలు. నేను ఉత్తర దక్షిణాలు. నీవు నా హృదయాన్ని చీల్చుతావు. నీకోసం నన్ను నేను రెండు సగాలుగా చీల్చుకుంటాను. దూరం నుండి చూసేవారికి మనిద్దరం ఒక్కటే అన్పిస్తాం. దగ్గరగా చూస్తేనే తెలుస్తుంది. నీవు వేరు నేను వేరని.... మనం ఎన్నడూ కలవలేమని. కానీ మనం కలిసి ఉంటేనే బట్టతీరు.... విడిపోతే నీవూ నూలే. నేనూ నూలే. నీవు పడుగు - నేను పేక. నీవు సరివి. నేను నాడెను...." అలాగే.... ఎమర్జెన్సీని అనుశాసన పర్వంగా పొగిడిన ఈ కవిత చాలా బాగుంది అంకుల్....." అంటూ ఆ కవితను చదవబోయింది కోవేరి.

"ఆపాపు" అంటూ ఆ కవితల ఫైలును లాక్కున్నాడు లక్ష్మణ్. కోవేరి రెచ్చిపోయింది. గొంతు పెంచింది.....

"ఏంటి అంకుల్ దౌర్జన్యం.... మీ గతాన్ని... మీ సాహిత్య పరిణామక్రమాన్ని చదివి తెల్సుకునే హక్కు అందరికీ ఉండాలి.... అంకుల్ డౌన్‌డౌన్.... అంకుల్ డౌన్....." అంటూ మద్దతు కోసం ఊర్మిల ఆంటీ వద్దకు పరిగెత్తి చాయె పట్టుకొచ్చింది. చాయెలు పూర్తయ్యాక ప్రారంభించాడు లక్ష్మణ్.

"ఇవన్నీ యిపుడు బాగాలేవు. కంచికచెర్ల కోటేశు గురించి ఎందుకు రాయలేదు. శ్రీకాకుళ ఉద్యమం గురించి కాకుండా దాన్ని అణిచివేసిన వెంగళ్రావు గురించి అనుశాసనపర్వంలో ప్రశంసించడం.... ఈ చెత్తంతా తొలగించాలి....."

కోవేరి రెచ్చిపోయింది. "అలా తొలగించడానికి వీల్లేదు. బుద్ధుడు.... మార్క్సు.... అంబేడ్కర్.... చలం..... చిన్నప్పట్నించి ఏం చెప్పారో.... ఆ కొటేషన్లమీద యుద్ధం చేసే మీరు ఎప్పుడేం మాట్లాడారో అందరికీ తెలియాలి. వాళ్ళ భావాల్ని వందలవేల ఏళ్ళుగా తెల్సుకుంటున్నాం... మీ భావాలు ముప్పయి ఏళ్ళకే ఎట్లా పాతబడ్డాయి. నో నెవర్.... మీరు పాతబడ్డాయని అన్నంత మాత్రాన మేం అంగీకరించం. వాటినీ తెల్సుకుంటాం....."

అకస్మాత్తుగా లక్ష్మణ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వెక్కి వెక్కి ఏడ్చాడు. జీవితంలో ఎన్నడూ యితరుల్ని ఏడ్పించడమే తప్ప ఏడ్వడం ఎరుగని తన భర్త ఏడ్వడం ఊర్మిలకు అదోలా ఉంది. కంగారు పడిపోయింది. తనను తాను కంట్రోలు చేసుకొని కళ్ళు తుడుచుకున్నాడు లక్ష్మణ్. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు యూనివర్శిటీ లైబ్రరీలోని వేల గ్రంథాలను చూసిన విషయం అకస్మాత్తుగా గుర్తొచ్చింది. ఎన్ని గ్రంథాలు, ఎన్ని సబ్జెక్టులు.... ఎన్ని వేల పరిశోధనలు.... ఎన్నివేల కథలు, నవలలు.... ఎన్ని వందల సంవత్సరాల ఆ జ్ఞాన సముద్రంలో, ఆ ప్రపంచ సాహిత్యంలో తానెంత తాను రాసిందెంత.... సముద్రంలో నీటిచుక్క. ఉద్వేగాన్ని అదుపు చేసుకుంటూ అన్నాడు లక్ష్మణ్....

"నిజం చెప్పనా.... కోవేరీ.... నేనో గాడిదను. గాడి తప్పిన గాడిదను. ఏ బూడిదలోనైనా

పొర్లే అడ్డగాడిదను. చుట్టూ నలుగురు అహో.... ఒహో.... అంటే ఆ పొగడ్తల బూడిదనే పన్నీరనుకొని పెయ్యంతా పూసుకున్న కీర్తి దురద గాడిదను.... కుక్క చేసే పనిని గాడిదలా చేసి వీపు పగలగొట్టించుకున్న రచయితను. ఒక్క లాఠీ దెబ్బ తినకుండా దేని జోలికి పోకుండా రచనే పరమావధిగా ఎందరో రచయితలు ఎంతో గొప్ప రచయితలైపోయారు.... వాళ్ళే యిక నా ఆదర్శం..... వారి రచనల్లో ఎంత వినయం.... ఎంత లోతు... ఎంత సమగ్ర జీవితం....'' ఆవేశంగా చెప్పుకుంటూ పోయాడు. నిస్సత్తువగా చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు.... అతని మనస్సులో... ఏవేవో దృశ్యాలు.....

"ఏమైంది అంకుల్...'' అంటూ ఆందోళన పడిపోయింది కోవేరి. భర్త నుదుటి మీద సానునయంగా చేయి వేసింది ఊర్మిల.

"నాకేమీ కాలేదు. దయచేసి నన్ను ఒంటరిగా వదిలివేయండి....'' అంటూ అక్కన్నించి చ్రురున లేచిపోయాడు లక్ష్మణ్. తాను రాసిన సెక్సు కథను కూడా కోవేరి చదివేసి ఉంటుందా... "ఇద్దరు భర్తల ప్రమీల ప్రేమ'' కూడా చదివేసిందేమో.... తన గురించి ఎంత నీచంగా ఫీలవుతున్నదో కోవేరి.... ఇవన్నీ ఆ వ్యంగ్యంలో భాగమేనేమో....''

మరుసటి రోజు అవిశ్రాంతను తీసుకొని ఆదివారం ఉదయమే కోవేరి లక్ష్మణ్ యింట ప్రత్యక్షమైంది. సంపాదకవర్గం సమావేశం అంది. ఆ పొద్దంతా చర్చించుకొని సంకలనంలో చేర్చే రచనల్ని నాలుగో వంతుకు కుదించారు. మూడు పాళ్ళు తీసేసినప్పటికి.... ఎన్నిక చేసిన వాటిపట్ల లక్ష్మణ్‌కు సంతృప్తిగా లేదు. కాని పని ప్రారంభించాక మధ్యలో ఆపేయడం మరీ కష్టం అన్పించి ఊకొట్టాడు.

ముగ్గురు ప్రఖ్యాత రచయితల్తో ముందుమాట వంటి సందేశాలు రాయించాలని నిర్ణయించారు. తద్వారా రచనల గౌరవం పెంచవచ్చు ననుకున్నారు. ఆ సందేశాలు కొంచెం ప్రోత్సాహపూర్వకంగా ఉండాలని లక్ష్మణ్‌గారి మానసిక స్థితిని వివరిస్తూ లక్ష్మణ్‌కు తెలియకుండా అవిశ్రాంత, కోవేరీలు ఒక లేఖవారికి రాశారు.

బుంగరాజమ్మ చీల్చి చెండాడుతూ విమర్శ వంటి సందేశం పంపింది. అసలీ స్వర్ణోత్సవాలు వగైరా అంటేనే తనకు నచ్చవు అనే మాటనూ జోడించింది. కినారెగారు లక్ష్మణ్ రచనల్లోని అక్కడక్కడి మంచి పంక్తులు, భావాలు కోట్ చేస్తూ ప్రశంసాపూర్వకంగా చక్కని సందేశం పంపారు. మంచెకట్ల అనంతయ్య నుండి వచ్చిన సందేశం విలక్షణంగా ఉంది. కొన్ని వాక్యాలు లక్ష్మణ్ కంటతడి పెట్టించాయి. వాటిని డైరీలో యిలా రాసుకున్నాడు....

".....అతడి జీవితమంతా ఇతరుల మెప్పు పొందాలనే ప్రయత్నానికే ఖర్చయిపోయింది. అతను జీవితమంతా సమాజానికో..... రచనలకో వెచ్చించింది నిజమే. కాని అతను సమాజం పైనా సాహిత్యం పైనా తనదంటూ ఏ ముద్రా వేయలేకపోయాడు. కాలపరీక్షకు నిలబడే రచనలు పిడికెడైనా లేవు అనేది సత్యమే. అయితే అది కేవలం అతడి తప్పు కాదు. అతడు పుట్టి పెరిగిన సమాజం, వర్గం, కులం, పేదరికం, అతని మీద విధించిన పరిమితి అది. అతను పేరు కోసం పాకులాడాడు అని లోకం కోడై కూయవచ్చు. కాని అతడు ఆత్మగౌరవం కోసం పోరాడాడు.... అతని జీవితంలోని పరిణామాలన్నిటి మధ్య అంతస్సూత్రం యిదే.... అతను మనిషి కావడానికి ముప్పయ్యేళ్ళ జీవితాన్ని ఖర్చు పెట్టించింది ఈ దుర్మార్గ సమాజం, కులం, వర్గం. ఓడిపోయిన జీవితం గురించి కాదు బాధపడవలసింది. రచనా రంగంలో యిప్పుడతను పాతికేళ్ళ నవయువకుడు... ఇకనుండి గెల్చుకోవల్సిన జీవితం గురించి ప్రయత్నం చేయకపోవడం గురించి బాధపడాలి.... ఈ స్వర్ణోత్సవం సందర్భంగా యిక సాహిత్యంలో తన స్థానాన్ని గెలుచుకోవడం కోసం ప్రతిజ్ఞ తీసుకోవాల్సి ఉంది. పునరంకితం కావాల్సి ఉంది....''

మిట్టపెల్లి లక్ష్మణ్ హృదయంలో ఏవో వెలుగులు ప్రసరించాయి. నిజమే... యాభయి ఏళ్ళకే

ఆగిపోయిన రచయితలున్నారు. యాభయి ఏళ్ళనుండే రచనలు ప్రారంభించి, ప్రపంచ రచయితలైనవారున్నారు. ఒకటి రెండు ప్రక్రియలకే పరిమితమై ఆ ప్రక్రియలో తనదంటూ స్థానం ఏర్పరుచుకున్న వారున్నారు. నీవు ఎంత రాశావనేది ముఖ్యం కాదు. ఏ ప్రక్రియలో ఎంత స్థానం సంపాదించుకున్నావు అనేదే నిన్ను నిలబెడుతుంది....' ఎప్పుడో చదివినది గుర్తొచ్చింది. లక్ష్మణ్ మళ్ళీ మామూలు మనిషయ్యాడు. అవిశ్రాంతలా అందరినీ కలుపుకుపోయే ప్రయత్నాలు ప్రారంభించాడు.... స్వర్ణోత్సవ సభకు ఆహ్వానించడం అందుకొక చక్కని అవకాశం అని గమనించాడు.... ఇక అతని కలం ఆగలేదు.... ఎన్నో ఉత్తరాలు.... చక్కని ఆఫ్‌సెట్లో 'సావెనీర్ కమ్ సెలక్టెడ్ రైటింగ్స్' పుస్తకం తయారైంది. స్వర్ణోత్సవం సందర్భంగా తనకు సాహిత్యంలో గురువులైనవారినీ.... తమ ప్రాంతంలో కృషి చేసిన వారినీ, యువ రచయితలనూ.... ఏదో విధంగా సత్కరించి మెమొంటోలు యివ్వాలని సంపాదకవర్గం నిర్ణయించింది.

లక్ష్మణ్ స్వర్ణోత్సవ సభ ఏర్పాట్లన్నీ చక్కగా జరిగాయి. సభ బాగా జరిగింది. ఒక జ్ఞాపికగా అంతా వీడియోలో చేరిపోతున్నది.... సభ చాలా బాగా జరుగుతున్నందుకు అందరికీ ఎంతో తృప్తిగా ఉంది. సభానంతరం కవి సమ్మేళనం. చక్కని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.... స్థానికుల్ని ప్రోత్సహించడం కోసం వీటిని రూపుదిద్దారు.... అది స్వర్ణోత్సవ సభలా లేదు. ఒక చక్కని సాహిత్య సదస్సులా సాగింది. చివరగా ధన్యవాదాలు తెలుపుతూ లక్ష్మణ్ తన ప్రసంగాన్ని యిలా ముగించాడు.....

"ఇక నుండి నా శేష జీవితాన్ని కేవలం రచనా రంగానికి కేటాయిస్తాను. అన్ని సంగాలు, ఉద్యమాల నుండి ఈ రోజు నుండి తప్పుకుంటున్నాను.... విజ్ఞానం లేనిచోట అజ్ఞానమే జ్ఞానంగా అరుస్తుంది గాడిదలా.... మన పిల్లలు ఎదగాలంటే కనీసం వెయ్యి పుస్తకాల్తోనైనా ప్రతి ఉద్యోగీ, మేధావీ లైబ్రరీ నడపాలి..... మనది గాడిదలా తృప్తిపడే బతుకు కాకూడదు..... గాడిద ఎండాకాలం బలుస్తుందని వానాకాలం బక్కపడుతుందని ఒక జోకుంది. ఎండాకాలం వెనక్కి తిరిగి చూసుకొని అబ్బా ఎంత మేశాను అని ఎండిపోయిన భూమిని చూసి సంతోషిస్తుందట. ఆ సంతోషంతో బలుస్తుందట.... వానాకాలంలో ఎంతతిన్నా అంతా పచ్చగానే కనపడేసరికి నేనేమీ తినలేకపోయానే అనే రంధితో ఎంత తిన్నా బక్కపడుతుందట..... నేనింతకాలం.... యిలా బతికాను.... వందలాది అడ్రసులున్న ఈ డైరీని నా యీ పాతరచనల్నీ యిక్కడే అగ్నికి ఆహుతి చేస్తున్నాను.... ఇకనుండి ప్రచారానికి దూరంగా సమూహంలో ఒంటరిగా బతకనీయండని కోరుతున్నాను...."

వేదిక పక్కన కాలుతున్న కాగితాలు ఫ్యాన్ గాలికి పైకి లేస్తుంటే సభలో కలకలం రేగింది.... వెక్కి వెక్కి ఏడుస్తూ లక్ష్మణ్ ఒక్కసారిగా నొప్పి..... నొప్పి అంటూ ఆ మంటలో తూలిపడిపోయాడు. గుండెపోటు.... ఛాతీనొప్పి..... సభలో కలకలం.... లక్ష్మణ్‌కు గాయాలేమీ కాలేదు. వేదిక పక్కన పడుకోబెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు అన్నీ సజావుగానే సాగిపోయాయి.

ఆ రాత్రి కోవేరి నిద్రపోలేదు.... ప్రచారం.... చర్చలు.... కూడా మనుషుల్ని యింతగా తినేస్తాయా.... అంటూ ఆలోచనలో పడింది.... తాను నిజమైన రచయిత్రిగా ఎదగాలని తొలిసారిగా సీరియస్‌గా నిశ్చయించుకుంది.... అయినా అవిశ్రాంత అంకుల్‌లా జీవితంలో ఎదగడమే మొదటి ఆదర్శంగా ఉండాలి.

ఆ మరుసటి రోజు కోవేరి తాను అంతదాకా వద్దనుకున్న బ్యాంకు ఆఫీసర్స్ పరీక్షకు ఫీజు కట్టేసింది. వర్గవాద, దళితవాద, స్త్రీవాద సాహిత్యాన్నంతా కట్టకట్టి అటక ఎక్కించేసింది. లక్ష్మణ్ యింటికి వెళ్ళడం మానేసింది.... సలహాల కోసం ప్రిన్సిపాల్ అవిశ్రాంత యింటికి వెళ్ళడం ప్రారంభించింది.... లక్ష్మణ్ సీరియస్‌గా కథలు, నవలలు రాయడం ప్రారంభించాడు.......

*ఆంధ్రప్రభ దినపత్రిక* **(రచనాకాలం - జనవరి, 1997)**

***6 జులై 1997***